క్లుప్తంగా

నేడు ఫొటోగ్రాఫర్స్ క్రికెట్ టోర్నమెంట్



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రాజ్

తిరుపతి కల్చరల్: తిరుపతి, తిరుమల ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫొటోగ్రాఫర్స్ స్నేహ పూర్వక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రాజ్ తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ టోర్నమెంట్‌లో తిరుమల, తిరుపతి, చంద్రగిరి, రేణిగుంటకు చెందిన ఆరు టీంలు పాల్గొంటాయని తెలిపారు. ఇందులో విన్నర్స్, రన్నర్స్‌కు రూ.10 వేలు, రూ.5వేలు బహుమతులుగా ఇవ్వనున్నట్లు చెప్పారు. దీనికి ఫొటోగ్రాఫర్లందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు బాలాజి, గిరిధర్, ఆనంద్, సునీల్, సురేష్, రహంతుల్లా పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ జిల్లా నూతన కమిటీ ఎంపిక



గుడ్లూరు భారతి



కొత్తపల్లి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: ఐఎఫ్‌టీయూ తిరుపతి జిల్లా నూతన కమిటీని ఎంపిక చేసినట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి రాయపనేని హరికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ నూతన కమిటీని ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఐఎఫ్‌టీయూ తిరుపతి జిల్లా అధ్యక్షురాలుగా గుడ్లూరు భారతి, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి సుబ్రమణ్యం, ఉపాధ్యక్షురాలుగా జె.గంగావతి, సహాయ కార్యదర్శిగా సుభాషిణి, కోశాధికారిగా విజయకుమార్‌తో పాటు 8 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పేదలకు అన్నదానం



తిరుపతి కల్చరల్: లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వద్ద సుమారు 400 మంది రోగులు, వారి సహాయకులకు అన్నదానం చేశారు. ఆ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సోమయ్య, వికాస్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం ఉదయం ఆస్పత్రికి వచ్చే వారికి అల్పాహారం అందిస్తూ తమ వంతు సాయం చేస్తున్నట్లు తెలిపారు. హోటల్ వుడ్‌సైడ్ అధినేత కృష్ణ భట్ సహకారంతో ఈ రోజు అల్పాహారం అందించడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబు నాయుడు, సురేష్, శ్రీను, సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు..



తిరుపతి కల్చరల్: మాఘమాసం సందర్భంగా శాంత స్ఫూర్తి సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, టీటీడీ ఉద్యోగ సంఘ నేత లోకాచారి ఆధ్వర్యంలో సోమవారం కపిలతీర్థం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. దీనికి టీటీడీ ఎంప్లాయిస్ బ్యాంక్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ హాజరై అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఉద్యోగ సంఘ నేతలు రంగా నాయక్, దినేష్‌రెడ్డి, హనుమంతు, మునికుమార్, మురళి పాల్గొన్నారు.

వీఆర్‌ఓ నాగరాజుకు సత్కారం



చంద్రగిరి: తిరుపతి జిల్లా వీఆర్వోల సంఘం నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రామానుజపల్లి నాగరాజును సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక మాజీ ఎంపీటీసీ సభ్యుడు కేశవులు(బుజ్జి), జిల్లా అధ్యక్షుడు నాగరాజుతోపాటు కోశాధికారిగా నియమితులైన వీఆర్‌ఓ భాస్కర్‌ను సత్కరించారు.

కొంపముంచిన ఐరన్ బాక్స్

తిరుపతి క్రైం: ఇంట్లో ఐరన్ బాక్స్‌తో మంటలు చెలరేగిన సంఘటన సోమవారం రాత్రి నగరంలో చోటుచేసుకుంది. ఫైర్ అధికారుల సమాచారం మేరకు కోదండ రామాలయం ఉత్తరమాడ వీధిలో నివాసముంటున్న సుజాత దుస్తులు ఐరన్ చేస్తూ, ఐరన్‌బాక్స్‌ను అలానే వదిలేసి మరిచిపోయింది. తీవ్రమైన వేడితో దుస్తులకు మంటలు చెలరేగాయి. సకాలంలో ఫైర్ అధికారులు స్పందించడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. అయితే అప్పటికే సుమారు రూ.1.5 లక్షల విలువ చేసే దుస్తులు, వస్తువులు కాలిపోయినట్లుగా ఫైర్ అధికారులు తెలిపారు.

ఓటుతో జగనన్న రుణం తీర్చుకుంటాం

- జగనన్నను గెలిపిస్తే మరిన్ని పథకాలు
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే భూమన



సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ



టీడీపీ నాయకుడు వెంకటయ్యకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి



సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే, మేయర్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

తిరుపతి మంగళం: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు ఎప్పటికీ మరువలేమని, వచ్చే ఎన్నికల్లో ఓటుతో జగనన్న రుణం తీర్చుకుంటామంటూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి మాట ఇచ్చారు. తిరుపతి సుభాష్‌నగర్‌లో కార్పొరేటర్ మునిరామిరెడ్డి, 8వ డివిజన్ అధ్యక్షులు మురళి ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న అధికారంలోకి వచ్చిన మూడేళ్లల్లో అందించిన సంక్షేమ పథకాలను స్థానిక ప్రజలకు వివరించేందుకు వచ్చిన ఎమ్మెల్యే కరుణాకరరెడ్డికి ముందుగానే తాము పొందిన పథకాలను లబ్ధిదారులు వివరించారు. అడగకుండానే అన్నీ ఇచ్చిన జగనన్నే మాకు శాశ్వత సీఎంగా ఉండాలంటూ ఎమ్మెల్యేకి స్థానిక మహిళలు హారతులతో నీరాజనం పలికారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు మేలు చేస్తే వారిలో సంతోషం, అభిమానం, ఆదరణ ఎంతగా ఉంటుందో ఈ కార్యక్రమం ద్వారా తెలిసిందన్నారు. దేశ రాజకీయ చరిత్రలో నిలిచిపోయేలా పదుల కొద్దీ సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు, మహోన్నత వ్యక్తి సీఎం వైఎస్ జగన్ మాత్రమేనని చెప్పారు. మాట ప్రకారం ప్రతి సంవత్సరం పింఛన్‌ను పెంచుతూ ఈ ఏడాది జనవరికి రూ.2,750 అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగనన్నను తిరిగి గెలిపిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తారని పేర్కొన్నారు. ఒక్క అవకాశం జగనన్నకు వచ్చినందుకే ఇన్ని చేశారంటే మరొక సారి గెలిపిస్తే ప్రతి ఇంటా సంక్షేమాల పంట పండుతుందన్నారు. మేలు చేసిన వారిని మరువకూడదని, ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే స్థానిక ప్రజలను కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకుడు వెంకటయ్య

8వ డివిజన్‌లోని టీడీపీ నాయకుడు వెంకటయ్య సోమవారం కార్పొరేటర్ మునిరామిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర సంక్షేమం కోసం ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలు, తిరుపతి నగర అభివృద్ధికి ఎమ్మెల్యేగా భూమన కరుణాకరరెడ్డి చేస్తున్న కృషి ఎనలేనిదని వెంకటయ్య పేర్కొన్నారు. పేద ప్రజలకు జగనన్న చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నారాయణ, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ కడపగుంట అమరనాథరెడ్డి, పార్టీ నాయకులు రవిచంద్ర, గఫూర్, మురళి, తాలూరి ప్రసాద్, రాజేశ్వరి, శారద, శ్యామల, పద్మ, భాస్కర్‌రెడ్డి, గుణభూషణమ్మ, పాల్గొన్నారు.

ప్రజాసంకల్పం.. సంక్షేమ విప్లవం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు చేపట్టిన ప్రజాసంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో సోమవారం తిరుపతిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. సుభాష్‌నగర్‌లోని ముత్యాలమ్మ ఆలయం వద్ద ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభిమా నం చాటుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్రతో రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయం మొదలైందన్నారు. పాదయాత్రలో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారికి నేనున్నానంటూ భరోసా కల్పించారని కొనియాడారు. దీంతో దేశ రాజకీయాల్లో ఎవ్వరికి రానంతగా ఓట్లు, సీట్లు సాధించగలిగామన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ప్రపంచంలోనే ఏ నాయకుడూ చేయని విధంగా రూ.3.11లక్షల కోట్లను ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో అందజేసినట్టు గుర్తుచేశారు. అనంతరం మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఎంతకష్టం ఎదురైనా లెక్కచేయకుండా ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక నాయకుడు జగనన్న అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, మునిరామిరెడ్డి, పార్టీ నాయకులు తాలూరి ప్రసాద్, కడపగుంట అమరనాథ్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, రవిచంద్ర, గఫూర్, మురళి, రాజేంద్ర, శ్రీదేవి, శారద, రాజేశ్వరి, పద్మ, శాంతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



స్పందన ఫిర్యాదులను స్వీకరిస్తున్న మేయర్ శిరీషా, కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని నగర మేయర్ డాక్టర్ శిరీష సూచించారు. స్పందన, డయల్ యువర్ కమిషనర్ ప్రజాఫిర్యాదుల కార్యక్రమంలో సోమవారం కమిషనర్ అనుపమ అంజలితో కలసి పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను వారు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మేయర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపట్ల సకాలంలో స్పందించి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలు స్పందనలో అర్జీ వస్తే సమస్య పరిష్కారమవుతుందన్న నమ్మకంతో వస్తున్నారని చెప్పారు. వారి విశ్వాసాన్ని చూరగొనేలా అధికారులు ప్రతి ఫిర్యాదుకు పరిష్కార మార్గాన్ని చూపించాలన్నారు. పరిష్కరించలేని ఫిర్యాదులపై కారణాలతో కూడిన సరైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులదే అన్నారు. తరచూ ఒకే సమస్యపై ఫిర్యాదులు వస్తున్న వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కమిషనర్ అనుపమ అంజలి అధికారులతో మాట్లాడుతూ ప్రతి సోమవారం వార్డు కార్యదర్శులు మధ్యాహ్నం 12 గంటల వరకు తప్పనిసరిగా స్పందన నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కపిలతీర్థం రోడ్డు, హరేరామ హరేకృష్ణరోడ్డుకు ఇరువైపుల హోటల్స్ నిర్వాహకులు పొగను ఎగ్జిట్ ఫ్యాన్‌ల ద్వారా రోడ్లపైకి వదులుతుండడం వల్ల పాదచారులు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యంగా ఉందంటూ వచ్చిన ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్ వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, రెవెన్యూ ఆఫీసర్లు కెఎల్ వర్మ, సేతుమాధవ్, ఏసీపీ షణ్ముగం, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

లోకాయుక్త ఆదేశాలు బుట్టదాఖలు!



మార్కొండయ్య నాయుడు

చంద్రగిరి: అవినీతికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయాలని లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలను కొందరు అధికారులు బుట్టదాఖలు చేశారని మార్కండయ్యనాయుడు అనే వ్యక్తి ఆరోపించాడు. ఆయన సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఎం.కొత్తపల్లె వద్ద సర్వే నంబరు 232/3లోని తన 15 సెంట్లకు దొరస్వామి నాయుడు, కుమార స్వామి నాయుడు, ప్రకాశం, నాగరాజ నాయుడు, అగరాల సుబ్రమణ్యం రెడ్డి, బత్తయ్య, వెంకటేశు, నీలమ్మ పేర్లపై నకిలీ పట్టాలను సృష్టించి, ప్రభుత్వం పరిహారంగా అందించిన రూ.60లక్షల సొమ్మును కాజేశారన్నారు. దీనిపై లోకాయుక్తాకు ఫిర్యాదు చేయడంతో అక్రమాలపై విచారణ చేపట్టాలని అప్పటి కలెక్టర్‌ను ఆదేశించినట్లు వెల్లడించారు. అవినీతి జరిగిందని కలెక్టర్ నివేదికను అందజేసినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా గత ఏడాది ఏప్రిల్ 6వ తేదీన రెవెన్యూ అధికారులు, భూ సేకరణ అధికారులు, నకిలీ పట్టాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సొమ్మును రికవరీ చేయాలని లోకాయుక్తా, ప్రిన్సిపల్ (రెవెన్యూ) సెక్రటరీ ఆదేశించినట్లు వివరించారు. అయితే ఇప్పటికీ ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

టీటీడీ ఆలయాల్లో రథసప్తమి ఏర్పాట్లు

తిరుపతి అలిపిరి: టీటీడీ స్థానికాలయాలు, అనుబంధ ఆలయాల్లో ఈనెల 28న రథసప్తమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని జేఈవో వీరబ్రహ్మం అధికారులను ఆదేశించారు. ఆలయాలు, ఇతర విభాగాల అధికారులతో సోమవారం ఉదయం జేఈవో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుచానూరు, తిరుపతి శ్రీ కోదండరామాలయం, శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరాలయం, నారాయణవనం, నాగలాపురం, దేవుని కడప తదితర ఆలయాల్లో రథసప్తమి సందర్భంగా వాహనసేవలతో పాటు భక్తులకు మూలమూర్తి దర్శనం కల్పించాలని ఆదేశించారు. అన్ని ఆలయాల్లో వాహనాల పటిష్టతను ముందస్తుగా పరీక్షించాలని డీఎఫ్‌వోకు సూచించారు. దేవుని కడపలోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో రథోత్సవానికి గాను రథం పటిష్టతను పరిశీలించాలన్నారు. ఆయా ఆలయాల్లో వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశాలు ఏర్పాటుచేసి పెండింగ్ పనులు వేగవంతం చేయాలన్నారు. జమ్మూ, చెన్నై, రంపచోడవరం, సీతంపేట ప్రాంతాల్లో నిర్మాణం పూర్తయిన ఆలయాల్లో మహాసంప్రోక్షణకు సంబంధించిన ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయా ఆలయాలకు అవసరమైన ఆభరణాలు, శిలా విగ్రహాలు, పంచలోహ విగ్రహాలు, అర్చక సిబ్బంది, ఇతర డెప్యుటేషన్ సిబ్బంది, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై చర్చించారు. ఈ ఆలయాలకు సంబంధించి పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నివేదిక సమర్పించాలన్నారు. మహా సంప్రోక్షణ కార్యక్రమాలకు విచ్చేసే భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు అందించాలని, ఆకట్టుకునేలా విద్యుద్దీపాలంకరణలు, పుష్పాలంకరణలు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయాల వారీగా చేపట్టిన ఏర్పాట్లు, భవిష్యత్తులో చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. వర్చువల్ సమావేశంలో ఎస్‌ఈలు సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, డెప్యూటీ ఈవోలు గుణభూషణ్‌రెడ్డి, గోవిందరాజన్, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, వీజీవో మనోహర్, డీఎఫ్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులతో ఆహార పరిశ్రమలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభావతి

ఎర్రావారిపాళెం : సాంకేతిక పద్ధతులతో ఆహార పరిశ్రమల స్థాపనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయని డీఆర్‌డీఏ అదనపు పథక సంచాలకులు ప్రభావతి పేర్కొన్నారు. సోమవారం ఎర్రావారిపాళెంలో మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పంటల ద్వారా ఆహార శుద్ధి ఉత్పత్తులు, ఆహార పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ అనుమతలను ప్రభుత్వాలు మంజూరు చేస్తున్నాయన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయం, సబ్సిడీలు, ప్రోత్సాహాలను ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ అధికారులు హేమాద్రి, ఏపీ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ ఆదినారాయణ, అసిస్టెంట్ మేనేజర్ చిన్న గంగయ్య, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



అనిల్ (ఫైల్)

చంద్రగిరి: రోడ్డు ప్రమాదంలో గాయపడని వ్యక్తి సోమవారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానిక పాతపేటకు చెందిన అనిల్(36) శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో పూజారిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈనెల 4వ తేదీ సాయంత్రం జాతీయ రహదారి సమీపంలోని తారు ఫ్యాక్టరీ వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. మొదట 108లో తిరుపతి రుయాకు, అక్కడి నుంచి చెన్నైకి తీసుకెళ్లారు. క్షతగాత్రుడి తలకు తీవ్ర గాయం కావడంతో పరిస్థితి విషమించింది. ఆదివారం రాత్రి తిరిగి తిరుపతికి తీసుకురాగా.. సోమవారం ఉదయం స్థానికంగా ఉన్న ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

తిరుపతి అర్బన్: ఆర్టీసీలో ఉద్యోగం చేస్తూ 2016–19 మధ్య కాలంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు 34 మందికి కారుణ్య నియామకాలు చేపట్టనున్నట్లు తిరుపతి డీపీటీవో చెంగల్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీరికి గ్రామవార్డు సచివాలయాల్లో గ్రేడ్-2 పోస్టులు, వీఆర్వోలుగా, పంచాయితీ కార్యదర్శులుగా, జిల్లా ఆరోగ్యశాఖలోను, సేల్స్ టాక్స్ తదితర విభాగాల్లో నియమించనున్నట్లు వెల్లడించారు. మరోవైపు కార్గో సేవలను విస్తృతం చేసే భాగంగా డిజిటల్ పేమెంట్స్‌ను తిరుపతిలోనూ అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, నాయుడుపేటలో డిజిటల్ పేమెంట్స్ కొనసాగుతున్నాయని వివరించారు.

క్షతగాత్రులకు ఆరోగ్యశ్రీతో మెరుగైన వైద్యం



బాధితులతో వైద్య బృందం

తిరుపతి తుడా: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా మెరుగైన వైద్యాన్ని అందించి ప్రాణాపాయం నుంచి వైద్యులు కాపాడారు. ఈనెల 2న వేర్వేరుప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో వాయల్పాడుకు చెందిన గురునాథం, పిచ్చాటూరుకు చెందిన సూర్య, కడప జిల్లా శంకరాపురానికి చెందిన రమేష్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని శ్రీరమాదేవి మల్టీ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రికి తరలించారు. ఈ ముగ్గురికీ తలకు తీవ్రగాయాలయ్యాయి. అయితే మెదడులో రక్తం గడ్డకట్టడంతో క్రానియోటమీ విధానం ద్వారా ప్రముఖ న్యూరోసర్జన్ డాక్టర్ రాధాకృష్ణారెడ్డి బృందం విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించింది. ఒక్కొక్కరికి లక్షకు పైగా ఖర్చు అయ్యే శస్త్రచికిత్సను డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేశారు. ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ ప్రశాంత్ తదితరులు ఈ బృందంలో ఉన్నారు.

కోడి పందేలు నిషేధం

పాకాల : మండలంలో ఎక్కడైనా జల్లికట్టు, కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు తప్పవని సీఐ రాజశేఖర్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఆయన మహిళా పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు, జల్లికట్టు, పేకాట వంటివి నిర్వహిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి చర్యలపై కోర్టు నిషేధ చట్టాలు అమలులో ఉన్నాయని, దీన్ని పరిగణనలోకి తీసుకుని అందరూ పోలీసులకు సహకరించాలని, జీవ హింస చేయడం కూడా చట్టరీత్యా నేరమని తెలిపారు. సంఘ విద్రోహక చర్యలు చేపట్టే వారి వివరాలను పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీఐ పేర్కొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నాలు

తిరుపతి అర్బన్: జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమం నేపథ్యంలో పలు సంఘాలు ధర్నాలు నిర్వహించాయి. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించారు. ప్రధానంగా జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు బీడీ బాలాజీ నేతృత్వంలో బీసీ సంక్షేమ హాస్టల్స్ పనితీరుపై ప్రభుత్వం ప్రత్యేక నిఘా పెట్టాల్సి ఉందని డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఓబీసీ నేతలు గోపి,ప్రేమ్‌కుమార్, చంద్రబాబు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు. సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలంటూ సీపీఎంకు అనుబంధంగా ఉన్న ఏఐఎస్ఎఫ్ ఆందోళన చేసింది. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఉదయ, కార్యదర్శి చలపతి, విద్యార్థి సంఘం నేతలు సురేష్, సుందర్, నవీన్, ఓంరాజ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలు శిక్ష

తిరుపతి లీగల్ : చెక్‌బౌన్స్ కేసులో తిరుపతి సుందరయ్యనగర్‌కు చెందిన ఎస్.ఆదీశ్వరయ్యకు ఆరునెలలు జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు తీర్పు చెప్పారు. తిరుపతి రైల్వే కాలనీకి చెందిన తిరుపతిరెడ్డి వద్ద ఆదీశ్వరయ్య 2015 మే 2న రూ.9లక్షలను అప్పుగా తీసుకుని ప్రోనోట్ రాసి ఇచ్చాడు. ఆ సొమ్మును చెల్లించే క్రమంలో రెండు వేర్వేరు చెక్కులను 2015 డిసెంబర్‌లో అతను తిరుపతి రెడ్డికి ఇచ్చాడు. ఆ రెండు చెక్కులు బౌన్స్ కావడంతో ఆదీశ్వరయ్యపై తిరుపతి రెడ్డి కోర్టులో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశాడు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి ఆదీశ్వరయ్యకు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

చోరీ కేసులో ఇద్దరికి ..

తిరుపతి లీగల్ : చోరీ కేసులో ఇద్దరికి 173 రోజులు జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. తిరుపతికి చెందిన హర్షవర్ధన్, ఎ.రాజేష్ గత ఏడాది ఏప్రిల్ 20వ తేదీ కొర్లగుంట మారుతీనగర్ వద్ద ఓ ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లారు. యజమాని ఫిర్యాదు మేరకు ఈస్టు పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఇద్దరిని అరెస్టు చేసి హాజరుపరిచారు. ఇద్దరూ నేరం అంగీకరించడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధించారు.

34 మందికి జరిమానా

తిరుపతి లీగల్ : తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడపడం, పబ్లిక్ స్థలంలో పేకాట తదితర నేరాలకు పాల్పడిన 34 మందికి రూ.61,100 జరిమానా విధిస్తూ తిరుపతి మొదటి ప్రత్యేక కోర్టు మెజిస్ట్రేట్ సుబ్బలక్ష్మి సోమవారం తీర్పు చెప్పారు. పోలీసులు వీరిని కోర్టులో హాజరుపరిచారు.

ఎస్వీయూలో మంత్రిత్వ శాఖ బృందం



మంత్రిత్వశాఖ బృందంతో ఎస్వీయూ వీసీ రాజారెడ్డి

తిరుచానూరు: న్యూఢిల్లీలోని ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి రామకృష్ణన్ ఆధ్వర్యంలో ఆర్‌యూఎస్‌ఏ బృందం సోమవారం ఎస్వీ యూనివర్సిటీని సందర్శించింది. యూనివర్సి నుంచి అధ్యాపకులు దరఖాస్తు చేసుకున్న స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ హ్యాకర్ థాన్ అవకాశాలపై చర్చించారు. డాక్టర్ వి రామకృష్ణ మాట్లాడుతూ స్టూడెంట్ డిజైన్, ఇండస్ట్రియల్ డిజైన్, ఐపీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. యూనివర్సిటీ విద్యార్థులను ఎలా ప్రేరేపించాలి అనేఅంశంపై అధ్యాపకులకు తగిన శిక్షణ ఇచ్చినట్లు వివరించారు.

వీసీ, రిజిస్ట్రార్‌కు ఘనంగా వీడ్కోలు





వీసీ జమున, రిజిస్ట్రార్ మమతను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

తిరుచానూరు: శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో పదవీ విరమణ పొందిన వీసీ దువ్వూరు జమున, రిజిస్ట్రార్ మమతకు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఎస్పీఎం వీవీ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వర్సిటీ సావేరి అతిథి గృహంలో చేపట్టిన వీడ్కోలు సమావేశంలో టీచర్స్ అసోసియేషన్ సభ్యులు వీరిని శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షులు సరోజినీ మాట్లాడుతూ జమున, మమత ఆధ్వర్యంలో వర్సిటీకి ఎన్నో ప్రాజెక్టులు వచ్చాయని తెలిపారు.

వీఎల్‌సీసీ సెలూన్ క్లినిక్ ప్రారంభం



వీఎల్‌సీసీ సెలూన్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: ఎయిర్ బైపాస్ రోడ్డులోని అన్నమయ్య సర్కిల్ ఐడీబీఐ బ్యాంక్ పైన నూతనంగా ఏర్పాటు చేసిన వీఎల్‌సీసీ సెలూన్ అండ్ బ్యూటీ డార్మెట్, హెయిర్ క్లినిక్ సోమవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వీఎల్‌సీసీ సెలూన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సెలూన్ అధినేత కె.సురేష్ రెడ్డి, భాగస్వామి శివకృష్ణారెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఆనందరెడ్డి, శ్రీచైతన్య కాలేజ్ ఏజీఎం వాసుదేవరెడ్డి, ఏవో పి.మదన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.